విద్యార్థినులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

సమస్యల పరిష్కారం కోసం పోరుబాట

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 5: గురుకులంలోని సమస్యలను పరిష్కరించే వరకు బీఆర్ఎస్వీ గురుకుల బడిబాట పోరుబాట ఆగదని గురుకుల బడిబాట జిల్లా ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురుకుల బడిబాట గురువారం మార్కండేయకాలనీ, పద్మావతి కాలనీలోని ఎస్సీ, బీసీ బాలల, బాలికల వసతి గృహాలు, పాలకుర్తి మండలం జయ్యారంలోని ఎస్సీ బాలల వసతి గృహాన్ని గురువారం సందర్శించి మాట్లాడారు. కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు విద్యార్థులు తెలిపారు. వసతిగృహ పరిసరాల్లో పారిశుధ్యం లోపించిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా విద్యాశాఖ సంక్షేమ శాఖ మంత్రులను నియమించాలని డిమాండ్ చేశారు. వసతిగృహ సమస్యలు పరిష్కరించేంత వరకు బీఆర్ఎస్వీ గురుకుల పోరుబాట ఆగదని వారు హెచ్చరించారు. ఇక్కడ బీఆర్ఎస్వీ రాష్ట్ర మాజీ ప్రధానకార్యదర్శి రాజోజుల శివ, రామగుండం పట్టణ నాయకులు వలియోద్దీన్, జిల్లా నాయకులు ఉప్పు శివకుమార్, నాయిని అన్వేశ్, తదితరులు ఉన్నారు.

వసతి గృహాల్లో భోజనశాల పరిశుభ్రంగా ఉండాలి

బీసీ బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 5: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గురుకుల వసతి గృహాల పరిస్థితి దారుణంగా మారిందని, వసతి గృహాల నిర్వాకులు భోజనశాలలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని బీఆర్ఎస్వీ నాయకులు చుక్క శ్రీనివాస్, రాజోజుల శివకుమార్ కోరారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని గురువారం సందర్శించారు. హాస్టల్‌లోని వసతులు, పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చుక్క శ్రీనివాస్ మాట్లాడారు. గురుకుల బాటలో భాగంగా బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేసినట్లు తెలిపారు. విద్యార్థినులకు ఎలాంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకున్నామని వివరించారు. వార్డెన్, సిబ్బంది, అధ్యాపకుతో మాట్లాడి బోధన తీరును తెలుసుకున్నామని వివరించారు. ఎలాంటి సమస్యలు లేవని విద్యార్థినులు తెలిపారు. నాయకులు ఉప్పు శివకుమార్, బోయిన మనోజ్, అవినాశ్ పాల్గొన్నారు.

నిధుల కొరత..నిర్మాణం నిలిపివేత

కాచాపూర్‌లో నిర్మాణంలో ఉన్న మహిళా గ్రామైక్య సంఘ భవనం

జూలపల్లి, డిసెంబర్ 5 : మండలంలోని కాచాపూర్‌లో మహిళా గ్రామైక్య సంఘ భవనం నిర్మాణంలో కునుకు తీస్తోంది. స్వశక్తి మహిళా సంఘాల సభ్యులకు సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్ఎస్ సర్కార్ గ్రామానికో సంఘ భవనం నిర్మించడానికి సంకల్పించింది. ఇక్కడ భవన నిర్మాణ పనులకు రెండు విడుతలుగా రూ. 15 లక్షల నిధులు మంజూరు చేసింది. దాదాపు ఏడాది నుంచి నిర్మాణ పనులు పూర్తి కావడం లేదు. ఈ క్రమంలో పొదుపు సంఘం మహిళలు సమావేశాలు నిర్వహించుకోడానికి అవస్థలు పడుతున్నారు. కాంట్రాక్టర్ ఇప్పటి దాకా 90 శాతం పనులు చేశారు. దాదాపు రూ. 5 లక్షల దాకా పనుల బిల్లులు చెల్లించడం లేదనీ, మిగతా మిగులు పనులకు నిధులు అవసరమున్నట్లు కాంట్రాక్టర్ వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి బిల్లులు చెల్లించి పనులు పూర్తి చేయించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ ఆయాకు అన్యాయం

ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో దీక్ష చేపట్టిన బాధితురాలు జగదీశ్వరి

- న్యాయం కోసం తోటి సిబ్బందితో కలిసి దీక్ష...
- మధ్యలోనే స్పృహ తప్పిపడిపోడంతో దవాఖానకు తరలింపు...
- మళ్లీ వచ్చి కార్యాలయం ఎదుట దీక్ష కొనసాగింపు
- ఆఫీసు నుంచి జారుకున్న సీడీపీవో

కోల్‌సిటీ, డిసెంబర్ 5: గోదావరిఖని విఠల్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం (113)లో 12 ఏళ్లుగా హెల్పర్‌గా పని చేస్తున్న జగదీశ్వరి తనకు అన్యాయం చేశారంటూ గురువారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఆవరణలో దీక్ష చేపట్టింది. ఆమెకు మద్దతుగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల సహాయకులు తరలివచ్చి బైఠాయించారు. తాను హెల్పర్‌గా పని చేస్తున్న సెంటర్‌కు సంబంధించిన టీచర్ వేరే ప్రాంతానికి బదిలీ అయిందని, తనకు పదో తరగతి అర్హత ఉందని, ఇదే సెంటర్‌కు తనను ప్రమోట్ చేయాల్సి ఉండగా, మార్కండేయ కాలనీలోని ఓ సెంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న మరో హెల్పర్ వద్ద డబ్బులు తీసుకొని ప్రమోట్ చేశారని ఆరోపించింది. కాగా, ఈ వ్యవహారంపై ఇటీవల జిల్లా కలెక్టర్‌కు జగదీశ్వరి ఫిర్యాదు కూడా చేసింది. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో చివరకు గురువారం ఉదయం విఠల్ నగర్‌లోని ఐసీడీఎస్ కార్యాలయానికి చేరుకొని బైఠాయించింది. మధ్యాహ్నం సమయంలో స్పృహ కోల్పోయి పడిపోవడంతో తోటి సిబ్బంది హుటాహుటిన స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ కొద్ది సేపు చికిత్స పొందిన బాధితురాలు తిరిగి కార్యాలయానికి చేరుకొని అపస్మారక స్థితిలోనే దీక్షను కొనసాగించింది. ఇంత జరుగుతున్నా సీడీపీవో అలేఖ్య అక్కడ ఉండకుండా కార్యాలయం నుంచి జారుకున్నారు. మిగతా యూడీసీ, సూపర్‌వైజర్లు కూడా తమకేమీ పట్టనట్టుగా ఎవరి పనిలో వారు ఉన్నారు. విషయం తెలుసుకున్న తోటి హెల్పర్లు అక్కడకు చేరుకొని ఆమెకు న్యాయం చేయాలని సంఘీభావంగా బైఠాయించారు. ఆయాకు పదోన్నతి ఇవ్వడంలో పెద్ద మొత్తంలో అవకతవకలు జరిగినట్లు హెల్పర్లు ఆరోపించారు. ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్ పూర్తి స్థాయి విచారణ జరిపితే వాస్తవాలు బయట పడుతాయని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా బాధితురాలికి మద్దతుగా హెల్పర్లు కార్యాలయంలో ఆందోళన కొనసాగించినా సీడీపీఓ మాత్రం రాలేదు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఇటీవల పని ఒత్తిళ్లతో పాటు వేధింపులు కూడా ఎక్కువైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాగా, తనకు న్యాయం జరిగేంత వరకు దీక్షను కొనసాగిస్తానని బాధితురాలు స్పష్టం చేసింది. ఈ సంఘటనపై సీడీపీఓ అలేఖ్యను వివరణ కోరగా, తాను మీటింగ్‌లో ఉన్నానని దాట వేయడం కొసమెరుపు.

ఉత్తమ ఫలితాల సాధనకు తోడ్పడాలి

మంథని, డిసెంబర్ 5: పిల్లలు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు తల్లిదండ్రులు కూడా తోడ్పాటునందించాలని ప్రిన్సిపాల్ సయ్యద్ సలీం అన్నారు. మంథని బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాలలో తాము ఎంత చదువు చెప్పినా ఇంటి వద్ద ఎలా చదువుతున్నారనే విషయాన్ని తల్లిదండ్రులు తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. ఇంటి వద్ద పిల్లలు సెల్ ఫోన్లు, టీవీలకే పరిమితం కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కళాశాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై తల్లిదండ్రులు సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

ఆరు గ్యారంటీలు పెద్ద మోసం

చార్జీషీట్ విడుదల చేస్తున్న నాయకులు

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 5:గత అసెంబ్లీ సమయంలో మోసపూరిత వాగ్దానాలు, ఆరు గ్యారంటీల పేరిట రాష్ట్రంలోని ప్రజలను మోసగించిందని.. ఆరు అబద్దాలు-66 మోసాలతో మహిళలకు తులం బంగారం, స్కూటీలు ఇస్తామని చెప్పి ఘోరంగా మోసం చేసిందని బిజేపి జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఆరోపించారు. ఇలాలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న మోసాలు ,ఆరు గ్యారంటీలపై చార్జీషిట్ విడుదల చేశారు. కాంగ్రేస్ మోసపూరిత ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ డిసెంబర్ 6,7,8 తేదిల్లో నిరసనలు, బైక్ రాల్యీలు, భహిరంగ సభలు నిర్వహిస్తామని చెప్పారు. ఇక్కడ యాత్ర ప్రముఖ్ కాసిపేట శివాజీ,బిజేపి సీనియర్ నాయకులు శిరాలపు పర్వాతాలు, గొట్టెముక్కుల సురేశ్‌రెడ్డి, తంగెడ రాజేశ్వర్‌రావు, పోల్సాని సంపత్‌రావు, సోమరాపు లావణ్య, ఎర్రోళ్ల శ్రీకాంత్, పెద్దపల్లి రవీందర్, లక్ష్మినర్సయ్య, కావేటి రాజగోపాల్, మహవాది రామన్న, ఉప్పు కిరణ్, మేకల శ్రీనివాస్, తిరుపతి యాదవ్, రాము తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులు ఆపాలి

ర్యాలీ తీస్తున్న హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 5: బంగ్లాదేశ్‌లోని హిందువులపై జరుగుతున్న దాడులు ఆపాలని, హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లోని హిందువులకు మద్దతుగా గురువారం సంఘీభావ రాల్యీ నిర్వహించారు. ఈ రాల్యీ జెండా చౌరస్తా నుంచి అమర్‌నగర్, ప్రగతినగర్, అయ్యప్పదేవాలయం, బస్‌స్టాండ్, జిల్లా కలెక్టరేట్ వరకు సాగింది. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఇక్కడ బీజేపీ నాయకులు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి సొమరాపు లావణ్య, వేల్పుల రమేశ్, మేకల శ్రీనివాస్, శిరాలపు పర్వతాలు, పోల్సాని సంపత్‌రావు, తంగేడ రాజేశ్వర్‌రావు, సొమరాపు అరుణ్, కావేటి రాజగోపాల్, జంగ చక్రధర్‌రెడ్డి, శింగారి సతీశ్, పర్స సమ్మయ్య, పల్లే సదానందం, రూపాదేది, ఉప్పు కిరణ్, లక్ష్మినర్సయ్య, నర్సింగం పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

విద్యార్థినిని అభినందిస్తున్న దాసరి మమతారెడ్డి

పెద్దపల్లి, డిసెంబర్5: రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన ట్రినిటి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం సహస్రను మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి గురువారం పాఠశాల ఆవరణలో అభినందించారు. ఇటీవల హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో అండర్ -17 విభాగంలో సహస్ర బ్రాంజ్ మెడల్ సాధించిందని ట్రినిటి విద్యా సంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ప్రశాంత్‌రెడ్డి, మమతారెడ్డి విద్యార్థినికి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఇక్కడ పాఠశాల పీఈటీ రాకేశ్ ఉన్నారు.

పల్లవి స్కూల్ విద్యార్థుల ప్రతిభ

పతకాలు సాధించిన విద్యార్థులు

పెద్దపల్లి, డిసెంబర్5: జాతీయ స్థాయి గ్రామీణ క్రీడా పోటీలోల పల్లవి స్కూల్ విద్యార్థులు పతకాలు సాధించారని కరస్పాండెంటెండ్ శోభారాణి తెలిపారు. ఈ నెల 1,2 తేదీల్లో ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్‌లో రూరల్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి క్రీడా పోటీలలో పల్లవి స్కూల్ విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారన్నారు. ఖోఖో అండర్ 14 విభాగంలో బంగారు , క్రికెట్ అండర్ 14 విభాగంలో వెండి , చెస్ అండర్ 12లో బంగారు పతకాలు సాధించారని ఆమె వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆమె పతకాలు సాధించిన విద్యార్థులను, తెలంగాణ రూరల్ గేమ్స్ అధ్యక్షుడు కైలాశ్ యాదవ్, కార్యదర్శి శ్రీనివాస్, పీఈటీ రాజును అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గాయత్రి విద్యార్థులు

పతకాలు సాధించిన విద్యార్థులతో చైర్మన్ శ్రీనివాస్

పెద్దపల్లి, డిసెంబర్5: రాష్ట్ర స్థాయి భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలకు గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ గురువారం తెలిపారు. గీతా జయంతి సందర్భంగా గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో ఇటీవల గోదావరిఖనిలో నిర్వహించిన జిల్లా స్థాయి భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో విద్యార్థులు పాల్గొని శ్లోకాలను ఆలపించారు. ఉన్నత వర్గం విభాగంలో పూరెళ్ళ హన్విత ప్రథమ, చంద్రకారి లయవర్ధిని కన్సోలేషన్, కొమురవెల్లి కార్తీక్ ప్రథమ, పెద్దపల్లి క్వీనా హరిణి తృతీయ బహుమతి సాధించారు. ఈ నెల 8న హైదరాబాద్‌లోని రామంతాపూర్ అరోరా కాలేజ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి శ్లోక కంఠస్థ పోటీలకు ఎంపికైనట్లు శ్రీనివాస్ వెల్లడించారు. శ్లోకాలను తక్కువ సమయంలోనే అద్భుతంగా నేర్చుకొని శృతితో పాడేలా కృషి చేసిన ఉపాధ్యాయురాళ్లు కొమ్ము సృజన, శాంత లక్ష్మి, రాజమణిలను అభినందించారు. ఇక్కడ కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
I, KANDHALA RAJASHEKAR REDDY, S/o. KANDHALA RAM REDDY, R/o. H.No. 2-23, Godiselapeta village, Endapalli mandal, Jagtial dist, TG, corrected as my spouse/wife name MANJULA KANDHALA in place of MANJULA MANJULA for passport (No: Y6573583) purpose.

CHANGE OF NAME
★Guguloth Padma W/o. Guguloth Gadhar (old name) H.No: 5-116/5, Badi Thanda, mandal Rudrangi, Rajanna Sircilla Dist. my Name was changed to GUGULOTH RAJITHA, W/o. GUGULOTH GADHAR (New Name)
NTK-335492

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

గట్టయ్యను పరామర్శించిన సింగరేణి సీఎండీ

గట్టయ్యతో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

గోదావరిఖని, డిసెంబర్ 5: సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) మాజీ అధ్యక్షుడు వై గట్టయ్యను సింగరేణి సీఎండీ ఎన్ బలరాం పరామర్శించారు. అనారోగ్యం బారిన పడిన గట్టయ్యను బుధవారం రాత్రి పట్టణంలోని ఆయన ఇంటికి వెళ్లి కలిశారు. సీఎండీ గట్టయ్యతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఇక్కడ రామగుండం రీజియన్‌కు చెందిన ముగ్గురు జీఎంలు, అధికారులు ఉన్నారు.

మోసం చేయడానికే మాల గర్జన

సుల్తానాబాద్, డిసెంబర్ 5 : మాలలను మోసగించడానికే చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కుటుంబం మాలల మహాగర్జన నిర్వహించిందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గుండా థామస్ మాదిగ ఆరోపించారు. సుల్తానాబాద్‌లో గురువారం ఆయన మాట్లాడారు. ఎస్సీ షెడ్యూల్ కులాల వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశ పెట్టే వరకు ఉద్యమాన్ని ముందుకు నడపడానికి గ్రామస్థాయిలో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈనెల 12న సుల్తానాబాద్ మండల కమిటీ నియామకం ఉంటుందన్నారు. అన్నీ గ్రామాలను నుంచి మాదిగలు తరలిరావాలని పిలుపునిచ్చారు. చెన్నూర్ ఎమ్మెల్యే తన స్వార్థం కోసం మాలల మహాగర్జన నిర్వహించారని తెలిపారు. సమావేశంలో సిరిసిల్ల శంకర్, తాండ్ర అంజయ్య, సంకెనపల్లి లక్ష్మన్, అట్లూరి గంగారం, మాతంగి రాజమల్లు, పొగుల తిరుపతి, కనకం శంకర్ తదితరులున్నారు.

సీఎం సభలో పారిశుధ్య కార్మికుల శ్రమ దోపిడీ

కోల్‌సిటీ, డిసెంబర్ 5: పెద్దపల్లిలో బుధవారం నిర్వహించిన యువ వికాసం సభలో రామగుండం కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు శ్రమ దోపిడీకి గురయ్యారని, ఉదయం నుంచి రాత్రి వరకు కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకొని కనీసం అన్నం కూడా పెట్టని అధికారులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు ఈదునూరి నర్సింగ్ అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ జే అరుణ శ్రీని కోరారు . పారిశుధ్య విభాగంలోని దాదాపు వంద మంది కార్మికులను ఉదయం 7 గంటలకే సీఎం సభా వేదిక వద్దకు తీసుకవెళ్లి పారిశుధ్య పనులు చేయించారని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం కూడా పెట్టకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. సీఎం సభ ముగిసిన తర్వాత పారిశుధ్య కార్మికులు ఖాళీ కడుపులతో తిరుగుముఖం పట్టాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విజయవంతం చేయాలి

కమాన్‌పూర్, డిసెంబర్ 5: ఈనెల7న భూపాలపల్లి జిల్లా కాటారంలో నిర్వహించనున్న దళిత బంధు ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని దళిత బంధు సాధన సమితి నాయకులు కోరారు. మండల కేంద్రంలో మహాసభ కరపత్రాలను గురువారం విడుదల చేశారు. ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు లేదా అంబేద్కర్ అభయ హస్తం పథకం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రెండో విడుతలో దళిత బంధు జాబితాలో ఎంపికైన వారికి సాయం మంజూరు చేయాలని విన్నవించారు. నాయకులు అంబటి కనకయ్య, దాసరి రామస్వామి, చిప్పకుర్తి సత్యనారాయణ, ఆవునూరి రాయలింగు, రాయనర్సు, మట్ట నర్సయ్య, మల్లేశ్, రాంచంద్రం పాల్గొన్నారు.

ఓజీటీ తరగతులు ప్రారంభం

ముత్తారం, డిసెంబర్ 5: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 40 మంది ఎంపీహెచ్ డబ్ల్యూ విద్యార్థులకు ఓజీటీ (ఆన్ జాబ్ ట్రైనింగ్) తరగతులు ప్రారంభమైనట్లు ఎస్‌వో స్వప్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తారంలోని ఆరోగ్య కేంద్రంతో పాటు, మంథని ఆరోగ్య కేంద్రంలో ఈ తరగతులు నిర్వహించనున్నట్లు వివరించారు. నెల పాటు తరగతులు ఉంటాయని వివరించారు.

పరామర్శ

పెద్దపల్లి రూరల్, డిసెంబర్ 5: బ్రాహ్మణపల్లికి చెందిన కొంకటి రాజమ్మ ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధూకర్ గురువారం వేర్వేరుగా పరామర్శించారు. రాజమ్మ మృతికి గల కారణాలను ఆమె కొడుకు విజిలెన్స్ అండ్ ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ మాజీ సభ్యుడు కొంకటి లింగమూర్తిని అడిగి తెలుసుకుకున్నారు. రాజమ్మ చిత్రపటంపై పూలు చల్లి నివాళులర్పించారు. ఇక్కడ వారి వెంట జీ రఘువీర్ సింగ్, నాయకులు నారాయణదాస్ మారుతి, గాండ్ల వెంకన్న, పూదరి మల్లేశ్ ఉన్నారు.

నేల స్వభావాన్ని బట్టి పంటలు సాగు చేయాలి

ముత్తారం : అవగాహన కల్పిస్తున్న అధికారులు

ధర్మారం, డిసెంబర్5: రైతులు నేలల స్వభావాన్ని అనుసరించి పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి, లాభాలు సాధించవచ్చని ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని బొట్లవనపర్తి రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మట్టి సేకరణ, పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ, పంటలకు రసాయనిక ఎరువులకు బదులుగా ప్రకృతి సేద్యం వైపు రైతులు అడుగులు వేయాలన్నారు. పంట క్షేత్రాల్లోని మట్టిని సేకరించి భూసార పరీక్షలు చేయించిన తర్వాత ఫలితాలకు అనుగుణంగా పంటలు సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు వినీత్, సతీష్, అఖిల, క్లస్టర్ అజిజ్ ఖాన్, కొక్కుల శివకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ముత్తారం, డిసెంబర్ 5: భూసార పరీక్షలు తప్పనిసరని, భూసారంపైనే పంటల దిగుబడి ఆధారపడి ఉంటుందని ఏవో అనూష తెలిపారు. ప్రపంచ మృత్తిక (నేల) దినోత్సవం సందర్భంగా ముత్తారం, మైదంబండ, ఖమ్మంపల్లి రైతు వేదికల్లో రైతులకు నేల ఆరోగ్యం, మట్టి నమూనా సేకరణ పరీక్ష విధానం, సాయిల్ హెల్త్ కార్డు, దాని లాభాలు, ఎరువుల యాజమాన్యల పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడారు. నేల ఆరోగ్యంగా ఉండేలా సహజ పద్ధతులను పాటించాలని సూచించారు. రైతులు తప్పని సరిగా మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇక్కడ ఏఈవోలు మనీషా, హారిక, శ్రీలేఖ, రైతులు పాల్గొన్నారు.

7న ఆటోల బంద్ విజయవంతం చేయండి

కమాన్‌పూర్ : పోస్టర్లు విడుదల చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

మంథని, డిసెంబర్ 5: ఈనెల 7న తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవి కుమార్ ఆధ్వర్యంలో చేపపట్టనున్న రాష్ట్ర వ్యాప్త ఆటో బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆటో యూనియన్ మంథని మండల అధ్యక్షుడు జంజర్ల రమేశ్, మైత్రి ఆటో యూనియన్ మాజీ అధ్యక్షుడు, జేఏసీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి గడిపల్లి శ్రీనివాస్ కోరారు. బంద్ పోస్టర్‌ను స్థానిక ఆటో స్టాండ్‌లో గురువారం విడుదల చేశారు. బంద్ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ జేఏసీ జిల్లా అధికార ప్రతినిధి మంథని అశోక్, ఉపాధ్యక్షుడు జాడిగాల రాము, వర్కింగ్ ప్రెసిడెంట్ వంగరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి తుంగల రాజు, నాయకులు గువ్వల పురుషోత్తం, దూడపాక రాజు, బడికల శ్యామ్, కార్యదర్శి మబ్బు తిరుపతి, వేల్పుల సాగర్, సహాయ కార్యదర్శి తిక్క సాగర్, రేపాక శంకర్, గణేశ్, కుమార స్వామి పాల్గొన్నారు.

కమాన్‌పూర్, డిసెంబర్ 5: ఆటో జేఏసీ ఆధ్వర్యంలో 7న నిర్వహించనున్న బంద్ విజయవంతం చేయాలని ఆటో జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు మట్ట నర్సయ్య, మండల అధ్యక్షుడు కందుల నర్సింగం కోరారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆటో జేఏసీ బంద్ వాల్ పోస్టర్లను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్ల జీవనం, జీవనోపాధి అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన ఏ ఒక్క హామీ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ. 15వేలు సాయం అందజేయాలని కోరారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 7న చేపట్టనున్న ఆటోల బంద్ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డ్రైవర్లు సంకరి కుమార్, కొనస మల్లయ్య, జంగపల్లి తిరుపతి, సుంకి సదయ్య, శ్రీనివాస్, కాస రవి, మల్లేశ్, దీకొండ రమేశ్, సిద్ధు, షారూక్, రాయనర్సు, రమేశ్, అమీర్‌ఖాన్, ఓదెలు, నర్సయ్య, లక్ష్మణ్, కొమురయ్య పాల్గొన్నారు.

మంథని: పోస్టర్లు విడుదల చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు